7

సాక్షి అనకాపల్లి

మంగళవారం। 19। ఆగస్టు। 2025



బుచ్చెయ్యపేట : వడ్డాదిలో పూర్తిగా మునిగిపోయిన డైవర్షన్ రోడ్డు



బుచ్చెయ్యపేట : వడ్డాదిలో కూలిన పశువుల ఆస్పత్రి

- జిల్లాలో మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు
- నీట మునిగిన పంట పొలాలు
- రోడ్లపై వరద ప్రవాహం..వాహన చోదకుల ఇక్కట్లు
- ప్రమాదస్థాయికి చేరుకున్న రిజర్వాయర్లు
- పొగిపొర్లుతున్న తాండవ, తాచేరు, పాలగెడ్డ, శారదానదులు
- మొద్దునిద్ర వీడని యంత్రాంగం
- ముందస్తు సహాయక చర్యలపై తీవ్ర నిర్లక్ష్యం



రోలుగుంట : బండారువీధిలో ఇళ్లలోకి వర్షపు నీరు



మాడుగుల : ఎం.కోడూరులో పొక్లెయిన్‌తో పంట కాలువలు తీయిస్తున్న దృశ్యం

వరద గుప్పెట్లో...

సాక్షి, అనకాపల్లి :

విశాఖపట్నం సమీపంలో ఏర్పడిన అల్పపీడనం.. జిల్లాపై విరుచుకుపడుతోంది. మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. సోమవారం రాత్రికి వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని ఈదురు గాలులతో వర్షం కొనసాగే అవకాశాలున్నాయని విశాఖ తుపాన్ హెచ్చరికల కేంద్రం అధికారులు హెచ్చరిస్తున్నా.. ప్రభుత్వం మొద్దు నిద్ర వీడడం లేదు. జిల్లా యంత్రాంగం ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోకపోవడమేనన్నది స్పష్టమవుతోంది. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ముందుస్తు హెచ్చరికలు జారీ చేయలేదు. దీని ఫలితంగా.. జిల్లాలో ప్రజలంతా తీవ్ర ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

రోడ్లపైకి వరదనీరు...

మాడుగుల మండలం శంకరం పంచాయతీలో 7 గిరిజన గ్రామాలు జల దిగ్బంధంలో నిలిచిపోయాయి. నిత్యవసర సరుకులు కూడా తెచ్చుకోలేని విధంగా ఆ గిరిజన గ్రామాల చుట్టూ ఉరకగెడ్డ చుట్టుముట్టింది. భీమునిపట్నం-వడ్డాది-నర్సీపట్నం(బీఎన్) ప్రధాన రోడ్డులో వడ్డాది వద్ద పెద్దేరు నదిపై ఉన్న డైవర్షన్ రోడ్డు పూర్తిగా నీటిలో మునిగిపోయింది. విజయరామరాజుపేటలో తాచేరు నదిపై ఉన్న డైవర్షన్ రోడ్డు నీటి ఉధృతికి కోతకు గురై పూర్తిగా నీటిలో మునిగిపోయి దెబ్బతింది. వడ్డాది పెద్దేరు నదిపై శిథిల వంతెనను ఆనుకుని వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. వీటి కారణంగా విశాఖ నుంచి వడ్డాది మీదుగా పాడేరు వెళ్లే బస్సులు, వడ్డాది నుంచి చోడవరం మీదుగా అనకాపల్లి వెళ్లే బస్సులు, నర్సీపట్నం వెళ్లే బస్సులతో పాటు ఇతర వాహన రాకపోకలు స్తంభించాయి. వాహనచోదకులు పలు ఇక్కట్లుకు గురయ్యారు.



మాడుగుల : సత్యవరం వద్ద పొంగి ప్రవహిస్తున్న పెద్దేరు



బుచ్చెయ్యపేట : లూలూరులో నీట మునిగిన వరి పొలాలు

నీట మునిగిన పంటపొలాలు..

నాతవరం మండలంలో 14 పంచాయతీలు పరిధిలో ప్రవహిస్తున్న ఏలేరు కాలువ వర్షపు నీటితో పొంగిప్రవహించడంతో కాలువకు ఇరువైపులా ఉన్న పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. ఖరీఫ్‌కు సిద్ధమైన వరి మడులతో పాటు తర పంటలు నీట మునిగాయి. జలాశయాలు పెద్దేరు, తాండవ, కళ్యాణపులోవ, కోనాం, రైవాడ ఎగువ నుంచి వచ్చే వర్షపు నీరుతో ప్రమాదకరంగా మారాయి. వర్షపు నీరుతో తాండవ, వరాహనది, తాచేరు, పెద్దేరు, శారదనది, పాలగెడ్డ, చింతగెడ్డ, నీటి ప్రవహం వల్ల పంట పోలాలు మీద నీరు పొంగి ప్రవహిస్తున్నాయి.

చెరువుల్లా రహదారులు...రాకపోకలకు అగచాట్లు

మాడుగుల మండలంలో కె.జె.పురం నుంచి ప్రధాన కూడలికి వెళ్లే రహదారి మీద నుంచి వర్షపు నీరు పొంగి ప్రవహిస్తుంది. కె.జె.పురం గ్రామం మీదుగా నడుస్తున్న ఆర్టీసీ బస్సు సర్వీసులు వర్షాలకు విజయరామరాజుపేట వద్ద బొడ్డేరు నది మీద కాజ్‌వే కొట్టుకొని పోవడంతో పాడేరు, మాడుగుల నుంచి విశాఖ, అనకాపల్లి, వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసులు కె.జె.పురం మీదుగా నడుపుతున్నారు. విశాఖ డిపోకు చెందిన విశాఖ-పాడేరు, అనకాపల్లి నుంచి పాడేరు ఏక్స్‌ప్రెస్ బస్సులును కె.జె.పురం గ్రామం మీదుగా నడుపుతున్నారు. మెట్రో ఏక్స్‌ప్రెస్‌లు ఈ రహదారిలో నిలుపుదల చేశారు. కాగా పల్లె వెలుగు బస్సులు పూర్తి స్థాయిలో నడపకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కోతకు గురైన పేట డైవర్షన్ రోడ్డు

బుచ్చియ్యపేట మండలంలో భీమునిపట్నం-వడ్డాది-నర్సీపట్నం(బిఎన్) ప్రధాన రోడ్డులో వడ్డాది వద్ద పెద్దేరు నదిపై ఉన్న డైవర్షన్ రోడ్డు పూర్తిగా నీటిలో మునిగిపోయింది. విజయరామరాజుపేటలో తాచేరు నదిపై ఉన్న డైవర్షన్ రోడ్డు నీటి ఉధృతికి కోతకు గురై పూర్తిగా నీటిలో మునిగిపోయి దెబ్బతింది.

వడ్డాది పెద్దేరు నదిపై శిథిల వంతెనను ఆనుకుని వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. దీని కారణంగా విశాఖ నుంచి వడ్డాది మీదుగా పాడేరు వెళ్లే బస్సులు, వడ్డాది నుంచి చోడవరం మీదుగా అనకాపల్లి వెళ్లే బస్సులు, నర్సీపట్నం వెళ్లే బస్సులతో పాటు ఇతర వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

వరాహనది ఉగ్రరూపం

కోటవురట్ల: నాలుగు రోజులుగా ఎగువ ఏజెన్సీలో కురుస్తున్న భారీ వర్షాలకు వరాహనది వరదనీటితో పోటెత్తింది. పాతరోడ్డు సమీపంలోని వరాహనదిలోకి సర్పానది కూడా కలియడంతో పందూరు వద్ద వరదనీటి ఉధృతి ఎక్కువగా ఉంది. దాంతో పందూరుకు రామచంద్రపురం జంక్షన్ నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. అడ్డురోడ్డు వెళ్లేందుకు చుట్టూ 6 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. కాగా వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున నదిని దాటే ప్రయత్నం చేయొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

ప్రమాదస్థాయికి రిజర్వాయర్లు

- తాండవ రిజర్వాయర్ గరిష్ట నీటి మట్టం 380 అడుగులు కాగా..ప్రస్తుతం నీటిమట్టం 375.2 అడుగులు ఉంది. వర్షాలు కురుస్తున్నందున ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో నీరు తాండవ ప్రాజెక్టులోకి 1200 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. తాండవ ప్రాజక్టు నుంచి ప్రధాన గేట్ల ద్వారా పంట కాలువలోకి రోజుకు 310 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు.
- పెద్దేరు జలాశయంలో ప్రమాద స్థాయికి నీటిమట్టం చేరుకుంది. గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా..136.8 మీటర్లకు నీటిమట్టం చేరింది. దీంతో 770 క్యూసెక్కులు నీరు విడుదల చేశారు.
- చీడికాడ మండలంలో కోనాం జలాశయంలో గరిష్ట నీటిమట్టం 101.25 మీటర్లు కాగా.. ప్రస్తుతం 99.80 మీటర్లకు చేరింది. వర్షాల కారణంగా 800 క్యూసెక్కులు నీటిని దిగువకు వదిలేశారు.
- కళ్యాణపులోవ రిజర్వాయర్ గరిష్ట నీటి మట్టం 460 అడుగులు కాగా..ప్రస్తుత నీటి మట్టం 451.2 అడుగులు ఉంది.
- రైవాడ జలాశయాంలో గరిష్ట నీటిమట్టం 114 మీటర్లు కాగా..ప్రస్తుతం 112.90 మీటర్లు ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 3,500 క్యూసెక్కుల వరద నీరు జలాశయంలోకి చేరుతుంది. సోమవారం రాత్రికి ప్రమాదస్థాయికి(113.50 మీటర్లు)కు చేరుకుంటే నీరు వదిలే అవకాశాలు ఉన్నాయి.

ముంచెత్తిన పెద్దేరు

మాడుగుల మండలంలో పెద్దేరునది సత్యవరం వద్ద కోతకు గురైంది. ఇప్పటికే పొలం పెద్దేరులో కలసి పోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పెద్దేరు పొంగినపుడల్లా తమ పొలం పెద్దేరులో కలిసి పోతుంటూ వాపోతున్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి రక్షణ గోడ నిర్మాణం చేపట్టాలని బాధిత రైతులు కోరుతున్నారు.

జిల్లాలో వర్షపాతం ఇలా..

గడిచిన రెండు రోజుల్లో అనకాపల్లి జిల్లాలోని సగటు 113.9 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కె.కోటపాడు 180.7 మి.మీ, దేవరాపల్లి 173, మాడుగుల 166.5మిమీ, చీడికాడ 157.5 మిమీ, చోడవరం 149 మి.మీ, రావికమతం 142.8మి.మీ, సబ్బవరం 136.9 మిమీ,రోలుగుంట 131.2, అనకాపల్లి 129.0 మి.మీ, బుచ్చియ్యపేట 127.0మి.మీ, పరవాడ 115.8మి.మీ,నర్సీపట్నం 109.1 మి.మీ, యలమంచిలి 105.7 మి.మీ, అచ్యుతాపురం 101.2 మి.మీ, , మాకవరపాలెం 90.1 మి.మీ, మునగపాక 103.2 మి.మీ, పాయకరావుపేట 76.8 మి.మీ, కొంకోట 100.1 మి.మీ, గొలుగొండ 94.8 మిమీ, కోటవురట్ల 76.7 మిమీ, నాతవరం 70.7 మిమీ, రాంబిల్లి 66.9 మి.మీ, ఎస్.రాయవరం 67.1 మి.మీ, నక్కపల్లి 64.5 మి.మీ వర్షపాతం నమోదైంది.

నీటమునిగిన పంటలు పరిశీలించిన అధికారులు

కె.కోటపాడు : భారీ వర్షాలకు ముంపునీటిలో ఉన్న పంటలను ప్రాథమికంగా వ్యవసాయశాఖ అధికారులు గుర్తించాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు ఆదేశించారు. మండలంలో సోమవారం ఉదయం వర్షం కురుస్తున్నా మండల వ్యవసాయధికారి సోమశేఖర్‌తో కలిసి మేడిచర్ల, ఎ.భీమవరం, కె.కోటపాడు గ్రామాల్లో నీట మునిగిన వరి పంటను గుర్తించారు. వర్షం తగ్గాక నీరు బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. తరువాత నేనో యూరియాను ఎకరానికి 500 ఎంఎల్ పిచికారి చేయాలని, పంటకు కుళ్లు తెగులు ఆశిస్తే హెక్సా కోనజోల్ ఎకరానికి 400 ఎంఎల్ పిచికారి చేయాలని సూచించారు.



మేడిచర్లలో నీటమునిగిన వరిపంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

జల దిగ్బంధంలో ఏడు గిరిజన గ్రామాలు

మాడుగుల : మండలంలో శంకరం పంచాయతీలో కొత్తవలస, వెలగలపాడు, గొప్పూరు, తాడివలస, రాయిపాలెం, రాజంపేట, మామిడిపాలెం,గ్రామాలు ఉరకగెడ్డ ఉద్రిక్తంగా ప్రవహించడంతో ఎటూ వెళ్లలేక రెండు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గిరిజనులు నిత్యావసర సరకకులకు ఇబ్బందులు పడుతున్నారు. ఉరకగెడ్డపై మామిడిపాలెం, తాడివలస, కొత్తవలస వద్ద మూడు వంతెనలు నిర్మాణం చేపట్టాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ గిరిజనులు ఉరకగెడ్డ వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు.



ఉరకగెడ్డ ఒడ్డున నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

తాండవకు వరదతాకిడిపై అప్రమత్తం

నాతవరం : తాండవ రిజర్వాయరులో నీటి మట్టం పెరుగుతుండడంతో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని నర్సీపట్నం ఆర్డీవో విల్లూరి వెంకట రమణ అన్నారు. ఆయన సోమవారం తాండవ రిజర్వాయరును సందర్శించారు. ప్రాజెక్టులో సోమవారం సాయంత్రానికి నీటి మట్టం 375.2 అడుగులు ఉందని డీఈ అనురాధ తెలిపారు. రిజర్వాయరు ప్రమాదస్థాయి నీటి మట్టం 380 అడుగులు కాగా 378 అడుగులకు నీరు చేరితే ప్రమాద హెచ్చరిక జారీ చేసి స్పిల్‌వే గేట్లు ద్వారా నదిలోకి నీరు విడుదల చేస్తామన్నారు. ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో నీరు తాండవ ప్రాజెక్టులోకి 1200 క్యూసెక్కులు వచ్చి చేరుతుందన్నారు.



తాండవ ప్రాజక్టు గేట్లు పరిశీలిస్తున్న నర్సీపట్నం ఆర్డీవో రమణ ప్రాజక్టు డీఈ అనురాధ

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ డిపో ప్రొగ్రాం

అనకాపల్లి : స్థానిక ప్రజారవాణాశాఖ(ఆర్టీసీ) అనకాపల్లి డిపోలో డైల్ యువర్ డిపో ప్రొగ్రాంను ఈనెల 19న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు డిపో అసిస్టెంట్ మేనేజర్ గౌరి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనకాపల్లి డిపోకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదులు, సూచనలు, సలహాల కోసం సెల్ నంబర్.9959225595 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని ఆమె కోరారు.

నవంబర్ 30న వైజాగ్ మారథాన్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

ఏయూ క్యాంపస్: వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో సంధ్య మెరైన్స్ సహకారంతో వైజాగ్ మారథాన్ నాల్గవ ఎడిషన్ నవంబర్ 30న జరగనుంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సోమవారం బీచ్‌రోడ్డులోని ఒక హోటల్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ 32 కి.మీ, 21 కి.మీ, 10 కి.మీ, 5 కి.మీ విభాగాల్లో పోటీలు ఉంటాయని, ఆసక్తి ఉన్నవారు వైజాగ్ మారథాన్ వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. వైజాగ్ రన్నర్స్ సొసైటీ అధ్యక్షుడు బాలకృష్ణ రాయ్ మాట్లాడుతూ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచడం ఈ మారథాన్ ముఖ్య ఉద్దేశమన్నారు. పోటీలో పాల్గొనే వారందరికీ టీషర్ట్, మెడల్, ఎనర్జీ డ్రింక్, అల్పాహారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంధ్యా మెరైన్స్ డైరెక్టర్ కె. ఆనంద్, వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభు కిశోర్, అపోలో హాస్పిటల్స్ సీవోవో శ్రీరామచంద్ర, దుద్దుపూడి శ్రీనివాస్, లక్ష్మీ శ్రీధర్ పాల్గొన్నారు.

ఇకపై అర్ధరాత్రి వరకు బార్లు బార్లా...

- 1వ తేదీ నుంచి నూతన బార్ విధానం
- జిల్లాకు 10 బార్ల కేటాయింపు
- నోటిఫికేషన్ విడుదల
- ఈనెల 26 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 28న కలెక్టరేట్‌లో డ్రా ద్వారా కేటాయింపు

అనకాపల్లి టౌన్ : కూటమి ప్రభుత్వం కొత్త బార్ పాలసీ ప్రకారం జిల్లాకు 10 బార్లు కేటాయించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి వి.సుధీర్ తెలిపారు. సోమవారం కొండ కొప్పాకలో ఉన్న స్థానిక జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెలాఖరుతో ప్రస్తుతం నడుస్తున్న బార్ల లైసెన్స్‌లు పూర్తవుతున్నాయని తెలిపారు. దీంతో జిల్లాలో కొత్తగా కేటాయించిన 10 కొత్త బార్లలో జీవీఎంసీ పరిధిలో 7 బార్లు, జిల్లాలో 3 బార్లు ఉన్నాయి. వీటిలో నర్సీపట్నంలో 2, యలమంచిలిలో 1 బారు కేటాయించినట్లు చెప్పారు. కొత్త బార్లకు సంబంధించి నోటిఫికేషన్ కూడా విడుదల చేసినట్లు వెల్లడించారు. జనరల్ కేటగిరీలో బార్లకు ఈ నెల 18 నుంచి 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ విధానంలో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులను కొండ కొప్పాక ఎక్సైజ్ కార్యాలయంలో నేరుగా సమర్పించాలని సూచించారు. 28వ తేదీన కలెక్టర్ కార్యాలయంలో డ్రా ద్వారా బార్ల కేటాయింపు ఉంటుందని వివరించారు. దరఖాస్తుతో పాటు ధరావతు సొమ్ముగా నాన్ రిఫండబుల్ రూ.5 లక్షలు, అప్లికేషన్ ఫీజు రూ.10 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒక్కో బార్‌కు కనీసం 4 దరఖాస్తులు రావాలి, లేని పక్షంలో ఆ బార్‌కు డ్రా తీయడం జరగదని తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా స్కూళ్లు, దేవాలయాలకు దూరంగా బార్లను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. బార్ లైసెన్సు కోసం 50 వేలు జనాభా ఉంటే రూ.35 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల వరకు జనాభా ఉంటే రూ.55 లక్షలు, రూ.5 లక్షలు దాటితే రూ.75 లక్షలు చెల్లించాలి. లైసెన్సు ఫీజును 6 ఇన్‌స్టాల్మెంట్లలో చెల్లించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించినట్లు తెలిపారు. అయితే ఒక బ్యాంక్ గ్యారెంటీ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. బార్ నిర్వహణ సమయాన్ని రాత్రి 12 గంటల వరకు పొడిగించారు.



జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి సుధీర్

ఆల్ ఇండియా లిబరల్ పార్టీకి షోకాజ్ నోటీసు

మహారాణిపేట (విశాఖ): గత ఆరేళ్లలో ఏ ఒక్క ఎన్నికల్లోనూ పోటీ చేయని నమోదిత, గుర్తింపు లేని రాజకీయ పార్టీలకు భారత ఎన్నికల సంఘం షోకాజ్ నోటీసులు జారీ చేసిందని విశాఖ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆల్ ఇండియా లిబరల్ పార్టీకి కూడా షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి ఎవరైనా సెప్టెంబర్ 8వ తేదీన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముందు హాజరై, అన్ని ఆధారాలతో రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.

దుర్గంధభరితంగా ఎన్టీఆర్ ఆస్పత్రి



ఎన్టీఆర్ ఆస్పత్రిలో కిడ్నీ రోగితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్



ఆస్పత్రి మెట్ల వద్ద నిరుపయోగంగా ఉంచిన సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

- ఆస్పత్రి పరిసరాల్లో పారిశుధ్యం అధ్వానం
- నిర్వహణ ఇలాగేనా అంటూ కలెక్టర్ ఆగ్రహం

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిని కలెక్టర్ విజయకృష్ణన్ సోమవారం మధ్యాహ్నం ఆకస్మికంగా పరిశీలించారు. ఆస్పత్రి ఆవరణలో వివిధ విభాగాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. వార్డులు, ఆస్పత్రిలో పలు విభాగాల్లో చెత్తాచెదారం పేరుకుని, అపరిశుభ్రంగా ఉండడంతో మండిపడ్డారు. రెండో అంతస్తులో వరండాలో వర్షపు నీరు ఎక్కువగా ఉందని, తక్షణమే తొలగించాలని, రోగులు వర్షపు నీటిలో జారిపడే అవకాశాలు ఉన్నాయని ఆదేశించారు. ఆస్పత్రి అవరణలో బైక్‌లు అడ్డదిడ్డంగా పార్కు చేశారని, ఆస్పత్రి పరిసరాలు దుర్గంధంతో నిండి ఉన్నాయని, ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. ఆస్పత్రిలో కొన్ని విభాగాల్లో చీకటిగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ బిల్లు ప్రభుత్వం చెల్లిస్తుంటే లైట్లు ఎందుకు వేయడం లేదని, మరోసారి ఇలా కనిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డి-అడిక్షన్(మాదక ద్రవ్యాల విభాగం) సెంటర్‌లో వైద్యులు ఎవరో, అటెండర్ ఎవరో, రోగి, సిబ్బంది ఎవరో అర్థం కాకుండా ఉందని, రోగుల బెడ్ వద్ద గుంపులు గుంపులుగా జనం ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రి ఆవరణలో కొత్తగా ఏర్పాటు చేసిన టీ క్యాంటీన్ వద్ద కూడా అపరిశుభ్రంగా ఉండడంతో నిర్వాహకునిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్య, సెక్యూరిటీ కార్మికుల జీతాలు తక్షణమే చెల్లించాలని సూపరింటెండెంట్‌కు ఆదేశాలు జారీ చేశారు. అంతకుముందు ఆస్పత్రి ఆవరణలో ఉన్న అన్నా క్యాంటీన్ పరిశీలించారు. ఆస్పత్రి ఎదురుగా నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ ఆస్పత్రి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వైద్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ శ్రీనివాసరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణారావు పాల్గొన్నారు.

సామాన్యుడి 'టోల్' తీస్తున్నారు..

- కార్లు, ఇతర వాహనాలకు తగ్గింపు
- ఆర్టీసీ ప్రయాణికులపై వడ్డింపు



నక్కపల్లి టోల్ గేట్, (ఇన్‌సెట్) పల్లె వెలుగు బస్సులో ప్రయాణికులు

నర్సీపట్నం : కారుల్లో తిరిగే వారికి ఊరటనిచ్చిన కేంద్ర ప్రభుత్వం..సామాన్య ప్రజలను విస్మరించింది. జాతీయ రహదారుల మీద ప్రయాణించే వారిలో ధనికులు, మధ్య తరగతి వర్గాలకు ఒక రకంగా, సాధారణ ప్రజలకు మరో రకంగా చూసింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కారుల్లో ప్రయాణించే వారికి కొంతైనా భారం తగ్గించిన, జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ ఆర్టీసీ ప్రయాణికుల గురించి పట్టించుకోలేదు. ప్రస్తుతం ఒక పక్క ప్రయాణం కోసం కారుకు రూ.150 వరకు టోల్ రుసుం చెల్లిస్తున్నారు. 2000 సంవత్సరం తరువాత రాష్ట్రంలో జాతీయ రహదారులు విస్తరణ పెరిగింది. ఈ రహదారులపై ప్రయాణించే ప్రతి వాహనదారుడి నుండి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఏటేటా ఈ ఛార్జీలు పెరుగుతూనే ఉన్నాయి. మొదటిలో రవాణా వాహనాలు, ధనికులు ప్రయాణించే కార్లు మీద మాత్రమే వేసిన టోల్ ఛార్జీల భారం తరువాత ఆర్టీసీ బస్సులపైనా పడింది. ఈ బస్సులపై పడిన భారం ఆర్టీసీ సంస్థ ప్రయాణికులపై వడ్డించడం మొదలు పెట్టింది. టోల్ గేటు ఉన్న ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సుల్లో 5 కిలోమీటర్లు దూరం ప్రయాణించాలంటే రూ.10 టిక్కెట్ ఛార్జీకు అదనంగా మరో రూ.10 టోల్ ఫీజు చెల్లించాల్సి వస్తోంది. జిల్లాలో ఆర్టీసీ బస్సుల్లో సుమారుగా లక్ష మంది ప్రయాణం చేస్తున్నారు. వేంపాడు టోల్ గేటు మీదగా ప్రయాణించే ప్రయాణికులే రోజుకు దాదాపు రూ.30 వేలు టోల్ ఛార్జీలు చెల్లిస్తున్నారు. జిల్లాలో నక్కపల్లి మండలం, వేంపాడు, సబ్బవరం మండలం మర్రిపాలెంలో టోల్‌గేట్లు ఉన్నాయి. నక్కపల్లి మండలం చిన్నదొడ్డుగొల్లు జంక్షన్‌లో బస్సు ఎక్కిన ప్రయాణికుడు రెండు కిలోమీటర్ల దూరంలో టోల్ గేటు అవతల ఉన్న కాగిత గ్రామం ఆర్టీసీ బస్సులో వెళ్లాలంటే రూ.10 టోల్ ఛార్జీ చెల్లించాల్సి వస్తోంది.

కార్లపై తగ్గిన భారం...

ఆగస్టు 15 నుంచి కారుల్లో ప్రయాణించే వారికి కేంద్ర ప్రభుత్వం కొంత భారం తగ్గించింది. కార్లు సొంతంగా వినియోగించుకునే వారు రూ.3 వేలు చెల్లిస్తే 200 సార్లు టోల్ గేటు మీదుగా రాకపోకలు సాగించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ కార్డు ఏడాది పాటు వినియోగించుకోవచ్చు. కార్లను మధ్య, ఎగువ తరగతి ప్రజలు ఎక్కువగా వినియోగిస్తారు. వారిపై పడుతున్న భారం గురించి ఆలోచన చేసిన కేంద్ర ప్రభుత్వం నిత్యం పల్లె వెలుగు, సిటీబస్సుల్లో తిరిగే రోజు కూలీలు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతులు గురించి ఆలోచించలేదు. టోల్‌గేటు ఉన్న జిల్లా వాహనదారులకు, పరిసర గ్రామాల వాహనదారులకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ కొంత రాయితీలు ఇస్తుంది. అదే జిల్లాలో ప్రయాణించే సామాన్య ప్రజలు వినియోగించే పల్లె వెలుగు బస్సుల నుంచి ఎటువంటి మినహాయింపు లేకుండా టోల్ ఛార్జీలు వసూలు చేస్తోంది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రజా రవాణా సంస్థ అయిన ఆర్టీసీ టోల్ భారం తగ్గించి ఊరట కల్పించాలని సామాన్య ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన బార్ కౌన్సిల్ సభ్యులు



జస్టిస్ తుహిన్ కుమార్‌ని కలిసిన రాష్ట్ర బార్ కౌన్సిల్ ప్రతినిధులు

విశాఖ లీగల్: రాష్ట్ర హైకోర్టు నూతన న్యాయమూర్తి జస్టిస్ గేదెల తుహిన్ కుమార్‌ను రాష్ట్ర బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ఎస్.కృష్ణమోహన్, సీనియర్ సభ్యుడు పి.నర్సింగరావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ వసతి గృహంలో జస్టిస్ తుహిన్ కుమార్‌తో పలు అంశాలపై వారు చర్చించారు. రాష్ట్రంలో న్యాయవాదులు ఎదుర్కొంటున్న వివిధ అంశాలను న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు.

లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారానికి కృషి

విశాఖ లీగల్: పెండింగ్ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్, మధ్యవర్తిత్వం కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అన్నారు. సోమవారం ఆయన జాతీయ న్యాయ సేవాధికారం సంస్థ, ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలకు అనుగుణంగా జ్యుడీషియల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీకి అవకాశం ఉన్న కేసులను గుర్తించి కక్షిదారులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునేలా చూడాలన్నారు. లోక్ అదాలత్ ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. జిల్లాలో సెప్టెంబర్ 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్, మధ్యవర్తిత్వం ద్వారా ఎక్కువ కేసులు పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని న్యాయస్థానాల జ్యుడీషియల్ అధికారులు, న్యాయసేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీప్రకాష్ వార్షికోత్సవాలు



గాతా రహే మేరా దిల్‌లో అలరించిన విద్యార్థులు

పాయకరావుపేట : శ్రీప్రకాష్ విద్యా సంస్థల 49వ వ్యవస్థాపక దినం సందర్భంగా సోమవారం అట్టహాసంగా వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేలా గాతా రహే మేరా దిల్ కార్యక్రమం నిర్వహించగా, విద్యార్థులు తమ పాటలతో ఉర్రూతలూగించారు. వేడుకలకు తుని, పాయకరావుపేట, అన్నవరం, పెద్దాపురం, కాకినాడ, రాజమహేంద్రవరంలో ఉన్న శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ ముగింపు కార్యక్రమానికి సినీ నేపథ్య గాయని కౌసల్య హాజరవుతున్నారని తెలిపారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా విచ్చేసిన ప్రముఖ కీబోర్డ్, హార్మోనియం, వాయిద్యకారులు దుర్గాప్రసాద్ రాతో, ఆల్ ఇండియా రేడియో, దూరదర్శన్ గాయకురాలు ఆర్.సునీత వ్యవహరించారు. ఈ కార్యక్రటమంలో సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, భానుమూర్తి, డాక్టర్ బంగ్రారాజు, డా. రామకృష్ణారెడ్డి, సీతారాణి, మేనేజరు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌పై వర్షం ప్రభావం.. తగ్గిన అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, డీఆర్వో వై.సత్యనారాయణరావు

తుమ్మపాల: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల ప్రభావం కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికపై పడింది. అర్జీదారులు అంతంత మాత్రంగా వచ్చి తమ సమస్యలు విన్నవించుకున్నారు. కలెక్టర్ విజయకృష్ణన్, డీఆర్వో వై.సత్యనారాయణరావు అర్జీలు స్వీకరించారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అర్జీదారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పలు ప్రజా సంఘాల నేతలు కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాలను వర్షం కారణంగా నిలిపివేశారు.

- పీజీఆర్ఎస్‌లో పరిష్కరించిన వినతులను దరఖాస్తుదారుడికి తెలియజేయాలని, పరిష్కారం కాని అర్జీల గురించి కారణాలు అర్జీదారుడికి వివరంగా తెలియజేయడం ద్వారా అర్జీలు రీ ఓపెన్ కాకుండా నివారించవచ్చని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. అర్జీలు జిల్లా అధికారి లాగిన్‌లో ఉంటే జిల్లా అధికారి, మండల అధికారి లాగిన్‌లో ఉంటే మండల అధికారి నేరుగా క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్లి పరిష్కరించాలన్నారు. మొత్తం 94 అర్జీలు నమోదు కాగా.. 52 రెవెన్యూ అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో కేఆర్ఆర్‌సీ, పీజీఆర్ఎస్ ప్రత్యేక ఉప కలెక్టర్లు ఎస్.సుబ్బలక్ష్మి, రమామణి, డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, డీఆర్‌డీఏ, హౌసింగ్, డ్వామా, మెప్మా పీడీలు శచీదేవి, శ్రీనివాస్, పూర్ణిమ దేవి, కె.సరోజినీ, జిల్లా పంచాయతీ అధికారి సందీప్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.హైమావతి, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి వి.సుధీర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కూటమి నాయకులపై ఫిర్యాదు

పంచాయతీ ఆస్తులకు రక్షించడంలో నిర్లక్ష్యంగా ఉన్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలతో పాటు ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసిన కూటమి నాయకులపై కేసు నమోదు చేయాలంటూ అనకాపల్లి మండలం బట్లపూడి పంచాయతీ రాయుడుపేట గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రూ.10 లక్షల ప్రభుత్వ నిధులతో చేపట్టిన మోదకొండమ్మ సామాజిక భవనం మెట్లను ఈ నెల 10న కొందరు వ్యక్తులు ధ్వంసం చేయడంపై చేసిన ఫిర్యాదును కనీసం పట్టించుకోలేదని ఆరోపించారు. అక్రమ నిర్మాణానికి సహకరిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని మళ్లీ అర్జీ అందజేశారు.

సాగు హక్కుల కోసం దళితుల వినతి

జీడి, మామిడి పంటలు సాగు చేసుకుంటున్న భూములను ల్యాండ్ పూలింగ్ నుంచి మినహాయించి సాగు హక్కులు కల్పించాలంటూ అనకాపల్లి మండలం తగరంపూడి గ్రామానికి చెందిన దళితులు కలెక్టర్‌ను వేడుకున్నారు. రాళ్లరప్పలతో ఉన్న కొండ పోరంబోకును 40 ఏళ్ల కిత్రం ప్రభుత్వం ఇచ్చిందని, కొండను చదును చేసుకుని జీడి సాగు ద్వారా ప్రతి ఏటా వచ్చిన ఫలసాయంతో జీవిస్తున్నామని, ఇప్పుడు భూములు లాక్కుంటే తమ బతుకులు రోడ్డుపాలవుతాయని వాపోయారు. సర్వే నం.60లో తమకిచ్చిన భూములు మినహా 260 ఎకరాల భూమి ఉందని, ప్రభుత్వ అవసరాలకు సదరు భూమిని వినియోగించుకుని తమకు మినహాయింపు ఇవ్వాలని కోరారు.

ఎస్పీ కార్యాలయానికి 20 అర్జీలు



అర్జీదారుల సమస్యను వింటున్న అదనపు ఎస్పీ మోహన్‌రావు

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయానికి సోమవారం 20 అర్జీలు వచ్చాయి. అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. చట్ట పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. భూ తగాదాలకు సంబంధించి 19, సైబర్ మోసాలకు సంబంధించి ఒక అర్జీ వచ్చాయన్నారు. సమస్యలు వారంరోజుల్లో పరిష్కరించేందుకు కిందిస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు మల్లేశ్వరరావు, శిరీష పాల్గొన్నారు.

గొలుసు కట్టు చెరువులు కాపాడుకోవాలి

- కలెక్టర్ విజయకృష్ణన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

తుమ్మపాల : గొలుసుకట్టు చెరువులను కాపాడుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. గొలుసు కట్టు చెరువులు దెబ్బతింటే నీరు వృథా అవుతుందని, వీటి నిర్మాణాలు పటిష్టంగా, సక్రమంగా ఉండేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి సోమవారం మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీ, తాగునీటి సమస్యలు, జల్‌జీవన్‌మిషన్ పనులు, క్యాటిల్ షెడ్లు, షేడ్ నెట్లు, సోక్ పిట్స్, గొలుసుకట్టు చెరువులు తదితర అంశాలపై సమీక్షించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పారిశుధ్య డ్రైవ్‌ను నిర్వహించాలన్నారు. బావులు, కుళాయిలు, బోర్ల వద్ద మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇంటింటికి చెత్త సేకరణ సజావుగా జరగాలన్నారు. గ్రామాల్లో ఆస్తి పన్నుల వసూలుపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతి పంచాయతీలోనూ 20 సోక్ పిట్స్‌ను నిర్మించాలని, తద్వారా నీటి నిల్వలు వృద్ధి చెందుతాయన్నారు. షెడ్ నెట్ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని డీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. పశువుల షెడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని, క్రాప్ మిత్రలకు జీతాలు చెల్లించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, జిల్లా పంచాయతీ అధికారి సందీప్ , డిప్యూటీ సీఈవో జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి మంజులవాణి, డ్వామా పీడీ పూర్ణిమాదేవి పాల్గొన్నారు.

ఏటికొప్పాకలో అశ్లీల నృత్యాలు

- టీడీపీ నేత ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకల ముసుగులో నిర్వహణ
- మద్యం మత్తులో యువకుల మధ్య వివాదం, ఉద్రిక్తత



ఏటికొప్పాకలో అశ్లీలనృత్య ప్రదర్శన

సాక్షి, అనకాపల్లి: కృష్ణాష్టమి వేడుకల ముసుగులో యలమంచిలి మండలం ఏటికొప్పాకలో టీడీపీ నేత ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి అశ్లీల నృత్యాలు ప్రదర్శించారు. ముగ్గురు యువతులను బాడుగకు తీసుకొచ్చి అశ్లీల నృత్యాలు వేయించారు. ఈ ప్రదర్శన వద్ద మద్యం మత్తులో ఉన్న యువకుల ఆగడాలు శ్రుతి మించి రెండు వర్గాలుగా విడిపోయి గొడవ పడ్డారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఆ సమయంలో అక్కడున్న యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్, హోం గార్డు ప్రేక్షక పాత్రకే పరిమితమవాల్సి వచ్చింది. హరే రామ హరే కృష్ణ, గీతా పారాయణంతో ఆధ్యాత్మికత ఉండాల్సిన ఆలయం పక్కనే అశ్లీల నృత్య ప్రదర్శన నిర్వహించడం గమనార్హం. వివరాలివి.

ఏటికొప్పాక గ్రామంలో ప్రతి ఏటా కృష్ణాష్టమిని పురస్కరించుకుని రెండ్రోజులు వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా ఆదివారం శ్రీకృష్ణుని ఆలయం వద్ద భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. అనంతరం రాత్రి 9 గంటల సమయంలో అశ్లీల నృత్యాలకు తెరలేపారు. శివాలయం, శ్రీకృష్ణుని ఆలయాల మధ్య ట్రాక్టర్‌పై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టేజీపై ముగ్గురు యువతులు బూతు పాటలకు అశ్లీల నృత్యాలను ప్రదర్శించారు. స్టేజీపై ఉన్న యువకులు యువతులతో అసభ్యకరంగా ప్రవర్తించారు. మీడియా కంట పడకుండా ఉండేందుకు గ్రామానికి ప్రవేశించే అన్ని దారుల్లో సమాచారం అందించడానికి వీలుగా కొందరు యువకులను ఉంచారు. వీరు ఎవరైనా ద్విచక్ర వాహనాలపై గ్రామంలోకి వస్తే యువకులు నిర్వాహకులకు ఫోన్ చేసి సమాచారం అందజేశారు. రాత్రి 11.30 గంటల సమయంలో యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఇద్దరు అక్కడకు చేరుకోవడంతో అశ్లీల ప్రదర్శన నిలిపివేశారు. అనంతరం అక్కడున్న కొందరు యువకులు రెండు వర్గాలుగా గొడవకు దిగారు. పోలీసులు వారిస్తున్నా యువకులు ఒకరిపై ఒకరు అరుపులు, కేకలతో దుర్భాషలాడుకోవడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. యువకుల మధ్య వివాదాన్ని అక్కడకు వచ్చిన పోలీసు సిబ్బంది తమ మొబైల్ ఫోన్లతో చిత్రీకరించారు. అయితే ఈ తతంగమంతా గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడి సమక్షంలోనే చోటుచేసుకోవడం గమనార్హం.

ప్రమాద స్థాయిలో కోనాం జలాశయం నీటిమట్టం



జలాశయం గేట్లు ద్వారా విడుదలవుతున్న నీరు

చీడికాడ: మండలంలోని కోనాం జలాశయం నీటిమట్టం ఒక్క రోజులో మూడున్నర మీటర్లు పెరిగి ప్రమాదస్థాయికి చేరుకుంది. దీంతో సోమవారం ఉదయం ప్రధాన గేట్లు ద్వారా 1200 క్యూసెక్కుల నీటి దిగువకు విడుదల చేసినట్టు ఏఈ దొర తెలిపారు. ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో జలాశయంలోకి ఇన్‌ఫ్లో 1200 క్యూసెక్కులు రావడంతో నీటిమట్టం ఒక్కసారిగా మూడున్నర మీటర్లు పెరిగి 99.80 మీటర్లకు చేరుకుంది. అధికారులు అప్రమత్తమై వచ్చిన ఇన్‌ఫ్లోను దిగువకు అదే విధంగా పంపించారు. సోమవారం ఉదయం నుంచి ఇన్‌ఫ్లోను బట్టి 850 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయం నీటిమట్టం 99.80 మీటర్లు కాగా.. ప్రమాద స్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు



రామోజు లోవరాజు (బుజ్జమ్మ)

నాతవరం : మండలంలో గన్నవరం గ్రామానికి చెందిన రామోజు లోవరాజు అనే బుజ్జమ్మ కన్పించలేదని అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు నాతవరం ఎస్ఐ సిహెచ్.భీమరాజు తెలిపారు. వివరాలివి. గ్రామంలో టెంట్ హౌస్ షాపు నిర్వహిస్తున్న రామోజు వెంకట బాబ్జి అనే వ్యక్తి తన భార్య బుజ్జమ్మ (40) ఉదయం నుంచి కనిపించడం లేదని సోమవారం సాయంత్రం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంటి వద్ద ఎటువంటి తగాదాలు పడలేదని, ఏ కారణంగా ఇంటి నుంచి వెళ్లిపోయిందో తెలియదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు నాతవరం పోలీస్‌స్టేషన్ లేదా ఫోన్ నంబర్ 9491516935కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

పొలాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలి



ఎం.అలమండలో మునిగిన పొలాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు

దేవరాపల్లి: భారీ వర్షాలకు నీటి ముంపునకు గురైన పంట పొలాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.మోహన్‌రావు రైతులకు సూచించారు. ఈ మేరకు మండలంలోని ఎం.అలమండ, కొత్తపెంట, తారువ, పెదనందిపల్లి, చిననందిపల్లి, దేవరాపల్లి గ్రామాల్లో సోమవారం క్షేత్ర స్థాయిలో పర్యటించి వరి పొలాలను పరిశీలించారు. పొలాల్లో చేరిన నీటిని గట్లు తెగ్గొట్టి భయటకు పోయేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండలంలో 19 గ్రామాల్లో సుమారు 270 ఎకరాల్లో నీరు నిల్వ ఉండటాన్ని గుర్తించామన్నారు.

తహసీల్దార్ పి.లక్ష్మీదేవి, ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు రైవాడ జలాశయంతో పాటు లోతట్టు పంట పొలాలు, శారదానదీ పరివాహక ప్రాంతాలలో పర్యటించారు. ముషిడిపల్లిలో నాగారాయుడు చెరువు, తామరబ్బ వంతెన వద్ద శారదానది ఉధృతిని పర్యవేక్షించారు. అప్రమత్తంగా ఉండాలని రైతులకు, స్థానిక ప్రజలకు సలహాలు, సూచనలు చేశారు.

నాకవుట్‌కు వారియర్స్.. సీజన్ నుంచి లయన్స్ ఔట్

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్‌లో భాగంగా వైఎస్ఆర్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో సోమవారం జరిగిన మ్యాచ్‌లో తుంగభద్ర వారియర్స్ నాలుగు వికెట్ల తేడాతో విజయవాడ సన్‌షైనర్స్‌పై గెలుపొందింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌షైనర్స్ ఏడు వికెట్లకు 161 పరుగులు చేసింది. ప్రతిగా తుంగభద్ర వారియర్స్ మరో ఓవర్ ఉండగానే ఆరు వికెట్లకు 167 పరుగులతో లక్ష్యాన్ని చేరుకుంది. దీంతో ఏపీఎల్ నాలుగో సీజన్‌లో ఆరు మ్యాచ్‌లు ఆడి నాలుగు విజయాలు, రెండు పరాజయాలతో నాకవుట్‌కు చేరిన తొలి జట్టుగా నిలిచింది. నాకవుట్‌లో స్థానం కోసం బుల్స్‌తో కింగ్స్ తలపడనుంది. ఆరు మ్యాచ్‌ల్లో రెండు వర్షార్పణంకాగా ఒక విజయం, మూడు పరాజయాలతో ఇంటి బాట పట్టిన తొలి జట్టుగా సింహాద్రి వైజాగ్ లయన్స్ నిలిచింది.

రాయలసీమ రాయల్స్ ఔట్

ఏపీఎల్‌లో అమరావతి రాయల్స్ ఏడు వికెట్ల తేడాతో రాయలసీమ రాయల్స్‌పై విజయం సాధించింది. 162 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన అమరావతి రాయల్స్ తరఫున కెప్టెన్ హనుమవిహారీ 47 పరుగులు చేయగా కరణ్‌షిండ్(56), సందీప్(23) అజేయంగా నిలిచి జట్టుకు విజయాన్నందించారు. ఈ పరాజయంతో రాయలసీమ రాయల్స్ జట్టు ఆరుమ్యాచ్‌ల్లో మూడే పాయింట్లతో టోర్నీ నుంచి వైదొలిగింది.

నక్కపల్లి ఆస్పత్రిలో ఆధునిక వైద్య పరికరాలు

- ప్రారంభించిన హోంమంత్రి అనిత
- హెటెరో, డక్కన్ కంపెనీల సహకారంతో ఏర్పాటు



ఆక్సిజన్ ప్లాంట్ ప్రారంభిస్తున్న మంత్రి అనిత

నక్కపల్లి: స్థానిక 50 పడకల ఆస్పత్రిలో ప్రభుత్వ నిధులతో పాటు హెటెరో, డక్కన్ కెంపెనీల సహకారంతో సుమారు రూ.60 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన పలు వైద్య పరికరాలు, అభివృద్ధి పనులను హోంమంత్రి వంగలపూడి అనిత సోమవారం ప్రారంభించారు. ప్రభుత్వం రూ.17.50 లక్షలతో ఎక్స్‌రే ప్లాంటు, రూ.18.50 లక్షలతో సీఆర్ఎం మెషీన్ సమకూర్చింది. హెటెరో కంపెనీ యాజమాన్యం రూ.12.20 లక్షలతో ఆధునిక వసతులతో కూడిన ఎక్స్‌రే గది, ఎల్ఈడీ డోరు నిర్మించింది. మరో రూ.7లక్షలు వెచ్చించి పెయింటింగ్స్ వేయించారు. డక్కన్ కెమికల్స్ కంపెనీ యాజమాన్యం రూ.12 లక్షలు వెచ్చించి ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేసింది. వీటిని హోంమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్ని వార్డులను ఆమె సందర్శించి, రోగులను పరామర్శించారు. రోగుల అవసరాలకు తగ్గట్టుగా నక్కపల్లి 50 పడకల ఆస్పత్రిని 100 పడకల స్థాయికి పెంచుతామన్నారు. అత్యవసర వైద్యం కోసం ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఆస్పత్రిలో మౌలిక సదుపాయాల కల్పనకు హెటెరో, డక్కన్ కంపెనీ యాజమాన్యాలు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. హెటెరో కంపెనీ ప్రతినిధులు కుళ్లాయిరెడ్డి, రాజారెడ్డి, ఎంవీఎస్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శిరీష, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

జోరువానలో క్వారీ బాధితుల నిరసన



వర్షంలో గొడుగులతో నిరసన తెలుపుతున్న క్వారీ బాధితులు

నర్సీపట్నం : మాకవరపాలెం మండలం, జి.కోడూరు క్వారీని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద జోరువానలో గొడుగులు వేసుకుని బాధితులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐ బీఎస్పీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొట్టా నాగరాజు మాట్లాడుతూ క్వారీ లీజు రద్దు చేయాలని బాధితులు 27 రోజులుగా ఆర్డీవో కార్యాలయం నిరాహార దీక్షలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవటం దారుణమన్నారు. తక్షణమే క్వారీ రద్దు చేసి, బాధితులకు న్యాయం చేయాలన్నారు. లేని పక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామన్నారు.

వ్యక్తి అదృశ్యం



షేక్ సాజిద్(ఫైల్)

కశింకోట: హైదరాబాద్‌కు చెందిన షేక్ షాజిద్ కనిపించడం లేదంటూ ఆయన భార్య ఫిర్యాదు చేసిన మేరకు సోమవారం కేసు నమోదు చేశామని సీఐ అల్లు స్వామి నాయుడు తెలిపారు. పదేళ్ల క్రితం కశింకోటకు వలస వచ్చి ఇక్కడ జాతీయ రహదారిపై బిర్యాని పాయింట్ నడుపుతూ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 11న బిర్యానీ సామాన్లు కొనుగోలు చేయడానికి స్కూటీపై అనకాపల్లికి వెళ్లి తిరిగి రాలేదన్నారు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో భార్య షాహిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

కశింకోట: కశింకోట-అనకాపల్లి రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారి పడి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు విశాఖ రైల్వే ఎస్ఐ కెటీఆర్ లక్ష్మి సోమవారం రాత్రి తెలిపారు. విశాఖ-విజయవాడ వైపు వెళ్లే మార్గంలో ఉన్న మృతదేహం 5.4 అడుగుల ఎత్తు కలిగి కుడి మోచేయి కింద విరిగిందన్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిన స్థితిలో ఉందన్నారు. ముఖం గుర్తు పట్టడానికి వీలు లేకుండా ఉందన్నారు. సిమెంట్ రంగు ఫుల్ హేండ్ షర్టు, నావీ బ్లూ జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతునికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు తన సెల్ నెంబర్ 73820 58996లో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువతీ యువకుల దుర్మరణం



ప్రమాద స్థలిలో మరణించిన సంతోష్ ,ఉష

పీఎం పాలెం: బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో యువతీ యువకులు దుర్మరణం చెందారు. సోమవారం రాత్రి 7 గంటల సమయంలో చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ ఎదురుగా హైవేపై చోటుచేసుకున్న ఈ దుర్ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు. నగర పరిధిలోని జోడుగుళ్లపాలేనికి చెందిన వాసుపల్లి దాసుకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు వాసుపల్లి సతీష్(19) భవన నిర్మాణ సెంట్రింగ్ పనులు చేస్తుంటాడు. అప్పుడప్పుడు చేపలుప్పాడలో ఉంటున్న తాతగారి ఇంటికి వెళుతుంటాడు. పలాసకు చెందిన ఉష(18)తో యువకుడికి పరిచయం ఉంది. తనను కలుసుకోవడానికి వచ్చిన ఆమెతో బైక్‌పై పలు ప్రాంతాల్లో తిరిగారు. ఈ క్రమంలో తాతగారి ఇంటి నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు వీరిద్దరూ బైక్‌పై పరదేశిపాలెం మీదుగా బయల్దేరారు. చంద్రంపాలెం హైస్కూల్ ఎదురుగా హైవేపైకి వచ్చేసరికి ముందు వెళ్తున్న బస్సు, లారీలను తప్పించబోయి లారీకి బైక్ తగలడంతో కింద పడిపోయారు. ఇద్దరికీ తలకు బలమైన గాయాలై సంఘటనా స్థలిలోనే మరణించారు. మృత దేహాలను పోస్టు మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ రాము తెలిపారు.

బ్యాటరీలో షార్ట్ సర్క్యూట్‌తో ఆటో దగ్ధం



దగ్ధమైన ఆటోను పరిశీలిస్తున్న చోడవరం అగ్నిమాపక సిబ్బంది

దేవరాపల్లి: దేవరాపల్లిలో బ్యాటరీ ఆటో దగ్ధమైన సంఘటన సోమవారం ఉదయం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అల్లు వెంకటరావు ఆదివారం రాత్రి ఇంటి ముందు తన ఆటోను పార్కింగ్ చేశాడు. సోమవారం ఉదయం అకస్మాత్తుగా ఆటోలో మంటలు చెలరేగడంతో గమనించిన స్థానికులు వెంకటరావుకు సమాచారం ఇచ్చారు. బాధితుడు వచ్చి చూసేసరికి ఆటో పూర్తిగా మంటల్లో చిక్కుకుని ఉంది. మంటలు అదుపు చేస్తూనే చోడవరం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అయితే సిబ్బంది వచ్చేసరికే ఆటో పూర్తిగా కాలిపోయింది. ఆటోలోని బ్యాటరీలో షార్ట్ సర్క్యూట్ జరగడంతోనే మంటలు రేగినట్టు భావిస్తున్నారు. సుమారు రూ.1.50 లక్షల మేర ఆస్తినష్టం జరిగిందని, జీవనాధారం కోల్పోయానని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

విశాఖపట్నం-రాయ్‌పూర్ పాసింజర్ రద్దు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధి పార్వతీపురం-సీతానగరం-బొబ్బిలి-డొంకినివలస సెక్షన్‌లో జరుగుతున్న మూడవ లైన్ సంబంధిత భద్రతా పనుల కారణంగా ఈ మార్గంలో నడిచే పలు రైళ్లను ఆయా తేదీల్లో రద్దు చేశారు. మరికొన్ని గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు.

రద్దు చేసిన రైళ్లు

ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు విశాఖపట్నం-రాయ్‌పూర్(58528) పాసింజర్, విశాఖపట్నం-కోరాపుట్(58537) పాసింజర్, విశాఖపట్నం-భవానిపట్న(58504) పాసింజర్, ఈ నెల 20వ తేదీ నుంచి 28వ తేదీ వరకు రాయ్‌పూర్-విశాఖపట్నం(58527) పాసింజర్, కోరాపుట్-విశాఖపట్నం(58537) పాసింజర్, భవానిపట్న-విశాఖపట్నం(58503) పాసింజర్‌లను రద్దు చేశారు.

గమ్యం కుదించిన రైళ్లు

ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు గుంటూరు-రాయగడ (17243) ఎక్స్‌ప్రెస్ విజయనగరం వరకు మాత్రమే నడుస్తుంది. ఈ నెల 20 నుంచి 27వ తేదీ వరకు రాయగడ-గుంటూరు(17244) ఎక్స్‌ప్రెస్ విజయనగరం నుంచి బయలుదేరుతుంది.

రీ షెడ్యూల్ చేసిన రైళ్లు

- ఈ నెల 22 నుంచి 29వ తేదీ వరకు దుర్గ్-విశాఖపట్నం (20829) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ మూడు గంటలు ఆలస్యంగా ఉదయం 8.45 గంటలకు బయలుదేరుతుంది. ఇదే తేదీల్లో విశాఖపట్నం-దుర్గ్ (20830) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రెండున్నర గంటలు ఆలస్యంగా సాయంత్రం 5.20 గంటలు బయలుదేరుతుంది.
- ఈ నెల 19న నాందేడ్-సంబల్‌పూర్(20810) నాగావళి ఎక్స్‌ప్రెస్ 4 గంటలు ఆలస్యంగా రాత్రి 8.30 గంటలకు బయలుదేరుతుంది.
- ఈ నెల 20, 21, 23, 24, 26వ తేదీల్లో విశాఖపట్నం-నిజాముద్దీన్(12807) సమతా ఎక్స్‌ప్రెస్ 5గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 2.20గంటలకు బయలుదేరుతుంది.

నేడు కిరండూల్ పాసింజర్ రద్దు

వర్షాల కారణంగా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా మంగళవారం విశాఖపట్నం-కిరండూల్-విశాఖపట్నం(58501/ 58502) పాసింజర్‌ను ఇరువైపులా రద్దు చేశారు. ప్రయాణికులు ఈ మార్పును గమనించాలని వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ కోరారు.

క్లుప్తంగా

విద్యుత్ అంతరాయం

కశింకోట: ఎండతెరిపి లేని వర్షాలతో కశింకోటలో సోమవారం తరచుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలు సరఫరాకు అంతరాయం కలిగింది. కొత్తూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో కండక్టర్ తెగిపోవడంతో ఇబ్బంది అంతరాయం కలిగిందని విద్యుత్ సిబ్బంది తెలిపారు.

సత్తెమ్మపేటలో ఇళ్ల చుట్టూ నీళ్లు



సత్తెమ్మపేటలో గృహాల ముందు నిలిచిపోయిన వర్షపునీరు

తుమ్మపాల: ఎడతెరిపిలేని వర్షాలకు మండలంలో శంకరం పంచాయతీ సత్తెమ్మపేట గ్రామంలో ఇళ్ల ముంగిట నిలిచిపోతోంది. దీంతో స్థానికులు గృహాల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. వర్షం నీరు గ్రామం నుంచి దిగువకు పోయేందుకు అవకాశం లేకపోవడంతో రెండ్రోజులుగా నీటి ముంపునకు గురైంది. సత్తెమ్మపేట నుంచి దిగువన శ్మశానవాటికను ఇటీవల కొంతమంది ఆక్రమించి రోడ్డు కోసం నీటి ప్రవాహానికి అడ్డంగా మట్టి వేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. రానున్న రెండు మూడు రోజులు వర్ష తీవ్రత ఇలానే ఉంటే గ్రామ నీటి ముంపునకు గురవుతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి నీటిని బయటకు పంపించేందుకు చర్యలు తీసుకోవాలని, ముంపు నుంచి గ్రామాన్ని కాపాడాలని కోరుతున్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సోమవారం నగరంలోని సీతమ్మధార ప్రాంతానికి చెందిన నరశిపురం మాధవరావు లక్ష 116 రూపాయలు విరాళం అందజేశారు. సంబంధిత విరాళాన్ని సింహగిరిపై పీఆర్‌వో కార్యాలయంలో నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు బాండ్‌ని ప్రోటోకాల్ సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ అందజేశారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

కశింకోట: స్థానిక సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయం (శివాలయం)లో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. అర్చకులు వి. చిదంబరం, వి. కృష్ణల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 29 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,500	4,700
రెండో రకం	---	---
మూడోరకం	3,270	3,350

అనకాపల్లి సినిమాలు

రాజా	: వార్ 2
సత్యనారాయణ స్క్రీన్-1	: వార్ 2
సత్యనారాయణ స్క్రీన్-2	: కింగ్ డమ్
పర్తిసాయి	: మహావతార్ నరసింహం
షిర్డిసాయి	: కూలీ
వెంకటేశ్వర	: హరిహర వీరమల్లు
శ్రీ సత్య	: సోమేశ్వర సులోచన
రామచంద్ర	: వార్ 2

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 20 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5, బీ పాజిటివ్-5, ఓ పాజిటివ్-6, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యా లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 368 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 203 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 సంప్రదించవచ్చు.

ముసురు కుంటున్న వ్యాధులు

- ఎడతెరిపిలేని వర్షాలతో సీజనల్ వ్యాధులు
- ఆస్పత్రులకు క్యూ కడుతున్న ప్రజలు
- అధ్వానంగా పారిశుధ్యం



కొత్త థియేటర్ల సమీపంలో రోడ్డుపై కాయగూరల వ్యర్థాలు



ఎన్టీఆర్ ఆస్పత్రిలో ఓపీ కోసం క్యూలైన్లలో ప్రజలు

అనకాపల్లి టౌన్: వారం రోజుల క్రితం వరకు వర్షాకాలంలోనూ వేసవిని తలపించిన ఎండలు... ఇప్పుడు ఉన్నపళంగా కురుస్తున్న వర్షాలు. వెరసి వాతావరణంలో ఒక్కసారిగా వచ్చిన మార్పులతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. దీనికి తోడు పట్టణం, గ్రామీణం అనే తేడా లేకుండా పారిశుధ్య లోపంతో ఈగలు, దోమలు స్వైర విహారం చేస్తూ పలు వ్యాధులకు కారకమవుతున్నాయి. దాంతో రోగులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు.

వ్యాధులతో భయాందోళన

వానాకాలం వచ్చిందంటే చాలు వ్యాధులు వెంటాడుతాయి. ఏ మాత్రం జాగ్రత్తగా లేకున్నా, అప్రమత్తత లేకపోయినా రోగాల బారిన పడాల్సిందే. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మలేరియా, దగ్గు, జ్వరం, జలుబు, విరేచనాలు, వైరల్ జ్వరాలతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ఇందులో చిన్నాపెద్దా తేడా లేకుండా వ్యాధుల బారిన పడుతున్నారు. ముఖ్యంగా ఒంటి నొప్పులు, కీళ్ల బాధలు, మోకాలి నుంచి అరికాలి పాదాల వరకు వాపులతో అడుగుతీసి అడుగే వెయ్యలేని విధంగా ఉంటుందని పలువురు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలు కొందరిలో వెంటనే తగ్గిపోతాయని, మరి కొందరికి ఎక్కువ సమయం పడుతుందని వైద్యులు చెపుతున్నారు. ఇక్కడి ఎన్టీఆర్ ఆస్పత్రికి ఎక్కువగా ఈ సీజనల్ వ్యాదుల బారిన పడిన వారే క్యూ కడుతున్నారు. వీరిలో ముఖ్యంగా చిన్న పిల్లలు ఉన్నారు.

నామమాత్రంగా పారిశుధ్య నిర్వహణ

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జ్వరాలతో జనం అతలాకుతం అవుతున్నప్పటికీ పారిశుధ్య నిర్వహణపై సరైన చర్యలు తీసుకోవడం లేదు. అడుగడుగునా నిర్లక్ష్య ధోరణి కనబడుతుంది. జీవీఎంసీ అరకొర సిబ్బందితో కాలువలలో పూడికలు తీస్తుండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో నీరు నిలిచే చోట దోమలు వృద్ధి చెందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వాటర్ ట్యాంక్‌లు, తాగి పారేసిన కొబ్బరి బొండాలు, చిన్న ప్లాస్టిక్ డబ్బాలు, గోతులలో వర్షపు నీరు దోమల వ్యాప్తికి కారణమవుతుంది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

వర్షాకాలంలో వచ్చే వ్యాధుల నుంచి బయటపడాలంటే జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాల్సిందేనని వైద్యులు సూచిస్తున్నారు. కొద్దిపాటి జ్వరానికే మందులు వాడనవసరం లేదు. తరచుగా చేతులు కడుక్కోవడం అతి ముఖ్యమైనది. తినడానికి ముందు, టాయిలెట్ ఉపయోగించిన తర్వాత తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలి. బయటి ఆహారాలకు దూరంగా ఉండాలి. పండ్లు, కాయగూరలు ఉప్పు నీటితో శుభ్రం చేసిన తర్వాత తినాలి. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. వేడివేడి ఆహారాన్ని తీసుకొని ఎప్పటికప్పుడు వాటిపై మూతలు పెట్టాలి. చంటి పిల్లలకు తప్పనిసరిగా దోమ తెరలను వాడాలి. శరీరం మొత్తం కప్పి ఉండేలా దుస్తులను వాడాలి.



రక్త పరీక్షలు చేయంచుకుంటున్న ప్రజలు

జాగ్రత్తలు పాటించాలి

ఈ వర్షాల్లో తడవడం వల్ల జ్వరం, జలుబు, దగ్గు వంటి వ్యాధులు ఎక్కువగా వస్తుంటాయి. శరీరం కాస్త అలసటగా ఉన్నా, తేడా వచ్చినా అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. తగిన పరీక్షలు చేయించుకోవాలి. వేడివేడి పదార్థాలను మాత్రమే తినాలి.

–డాక్టర్ డి.డి. నాయుడు, ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్

ఘనంగా పంచలోహ విగ్రహాల ప్రతిష్ట



ఆలయంలో కలశ పూజ చేస్తున్న అర్చకులు, కమిటీ సభ్యులు



క్షీరాభిషేకం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి: శ్రావణమాసం బహుళ దశమి పురస్కరించుకుని సోమవారం స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో పంచలోహ విగ్రహాల ప్రతిష్ట ఘనంగా జరిగింది. కన్యకాపరమేశ్వరి, జనార్దనస్వామి, నగరేశ్వరస్వామి వారి పంచలోహాలను ప్రతిష్ఠించి సంప్రోక్షణ, తదితర గణపతి పూజ, కలశ పూజ, తదితర పూజా కార్యక్రమాలు ప్రధాన అర్చకులు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాద వితరణ అందజేశారు. ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

నిలిచిన దోనె ప్రయాణాలు



గవరపేట వద్ద శారదా నదిపై నిలిచిన దోనె ప్రయాణాలు



కశింకోట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న శారదానది

కశింకోట: స్థానిక గవరపేటలో శారదా నది ప్రవాహ ఉధృతి పెరగడంతో సోమవారం దోనె ప్రయాణాలు నిలిచిపోయాయి. రాకపోకలకు రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నది అవతల వీరు పొలాల్లో వ్యవసాయ కార్యకలాపాలు, పాకల్లో పాడి పశువుల సంరక్షణ, పాల సేకరణకు నిత్యం రాకపోకలు సాగించడానికిగాను దోనెలపై దగ్గర మార్గంగా నది దాటుతుంటారు. ఈ నేపథ్యంలో తుపానుతో భారీ వర్షాల వల్ల ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు ఎక్కువగా వచ్చి చేరడంతోపాటు ప్రవాహ ఉధృతి ఒక్కసారిగా పెరిగింది. దీంతో దోనెలు నడపడానికి అవకాశం లేక నిలిపి వేశారు. దీంతో రైతులు గ్రామ శివారులో వంతెన మీదుగా మూడు కిలో మీటర్ల మేర నడిచి వెళ్లి తమ కార్యకలాపాలు సాగించుకోవలసిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

పునరావాస ప్యాకేజీ పెంచాలి

నర్సీపట్నం: నక్కపల్లి మండలం వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ భూనిర్వాసితులు పునరావాస ప్యాకేజీని పెంపుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. నిర్వాసితులైన రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, చందవాడ, అమలాపురం, డీఎల్.పురం గ్రామాల భూనిర్వాసితులు ఆందోళన బాటపట్టారు. ఇల్లు కోల్పోయిన కుటుంబాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఐదు సెంట్లు ఇంటి స్థలం, రూ.8,98,000 ప్యాకేజీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ ప్యాకేజీ ఎంత మాత్రం తమకు ఆమోదయోగ్యం కాదన్నారు. 2013లో వచ్చిన భూ సేకరణ చట్టంలో రూ.5 లక్షలు ప్యాకేజీ ప్రకటించిందన్నారు. ఈ చట్టం వచ్చి నేటికి 12 ఏళ్లు అవుతుందన్నారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు పెరిగాయన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.25 లక్షలు ప్యాకేజీ ప్రకటించాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు.

మూడు ద్విచక్ర వాహనాల రికవరీ

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి గురైన మూడు ద్విచక్ర వాహనాలను క్రైం విభాగం పోలీసులు గంటల వ్యవధిలో రికవరీ చేశారు. వివరాలివి.. సోమవారం ఉదయం పురుషోత్తపురం సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు, గొర్లివారికాలనీలో ఓ స్కూటీ చోరీకి గురైనట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై వెస్ట్ జోన్ క్రైం విభాగం సీఐ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వెంటనే స్పందించిన ఎస్ఐ డి.సూరిబాబు, సిబ్బంది కె.శ్రీనివాసరావు, వి.విజయ్‌కుమార్ రంగంలోకి దిగారు. సీసీ పుటేజీల ఆధారంగా ఆయా ద్విచక్ర వాహనాలను సాయంత్రానికి గుర్తించారు. వాటిని పెందుర్తి పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ సూరిబాబు చేతుల మీదుగా అందజేశారు.



రికవరీ చేసిన ద్విచక్ర వాహనాన్ని యజమానికి అప్పగిస్తున్న క్రైం ఎస్ఐ సూరిబాబు

ఏయూతో ఐఐటీఎం ఎంవోయూ

విశాఖ సిటీ : ఆంధ్ర విశ్వవిద్యాలయంతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటరాలజీ (ఐఐటీఎం) సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. సోమవారం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సమక్షంలో అవగాహన ఒప్పందంపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్. ధనుంజయరావు, ఐఐటీఎం డైరెక్టర్ డాక్టర్ ఎ.సూర్యచంద్రరావు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రాజెక్టులను సాధించి నిర్వహించే దిశగా రెండు సంస్థలు కృషి చేయాలని సూచించారు. పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్‌లను ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎంవోయూ ప్రగతిని సమీక్షించాలన్నారు. ఐఐటీఎం డైరెక్టర్ సూర్యచంద్రరావు మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఒక ప్రత్యేకమైన వాతావరణ అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉందన్నారు. వాతావరణ అంచనాలను సిద్ధం చేసి తగిన సూచనలు ఇచ్చే విధంగా ఈ కేంద్రం పనిచేయాలని చెప్పారు. ఏయూ వాతావరణ అధ్యయన విభాగాధిపతి ఆచార్య పి.సునీత మాట్లాడుతూ పరిశోధనలో సంయుక్త కార్యాచరణ, ఐఐటీఎంకు సంబంధించిన పరిశోధనలకు సమాచార మార్పిడి, విద్యార్థులకు శిక్షణ, వర్క్‌షాప్‌ల నిర్వహణ, ఇంటర్న్‌షిప్‌లు, ఫ్యాకల్టీ కొలాబరేషన్ వంటివి నిర్వహిస్తామని చెప్పారు. రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్ బాబు, ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, ఆచార్యులు, డీన్‌లు పాల్గొన్నారు.



ఏయూ వీసీ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఏయూ రిజిస్ట్రార్, ఐఐటీఎం డైరెక్టర్

70 ఎకరాల్లో నీట మునిగిన వరి నాట్లు



కశింకోట వద్ద కాశీమదుం గ్రోయిన్‌పై నుంచి శారదా నది నీటి ప్రవాహ ఉధృతి



ఏనుగుతుని వద్ద నీట మునిగిన వరి పొలాలు

కశింకోట: మండలంలో కురిసిన భారీ వర్షాలకు సుమారు 70 ఎకరాల్లో వరి పొలాలు నీటి మునిగాయి. ఏనుగుతుని, నూతలగుంటపాలెం, వెదురుపర్తి గ్రామాల్లో ముందుగా నాట్లు వేసిన చోట పొలాలు నీట మునిగాయి. వరి నారుమళ్లు, చెరకు తోటలు కూడా నీట మునిగాయి. దీంతో నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ సి.హెచ్. తిరుమలరావు, ఎంపీడీవో ధర్మారావు, ఆర్ఐ రమేష్, రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది బృందంగా పర్యటించి ఆయా గ్రామాల్లో నీట మునిగిన పొలాలను గుర్తించారు. ఆయా గ్రామాలతోపాటు తేగాడ, పేరంటాలపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, ఏఎస్ పేట, సోమవరం

పలు గ్రామాల్లో అధికారుల పరిశీలన

తదితర గ్రామాల్లో వారు పర్యటించారు. వర్షాలు తగ్గి వారం రోజుల్లోగా మునిగిన పొలాల నుంచి నీరు ఆరిపోతే నష్టం ఉండబోదని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారని తహసీల్దార్ తిరుమలరావు తెలిపారు. దీంతో ప్రస్తుతం నష్టంగా పరిగణించడం లేదన్నారు. మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న తుపాను ప్రభావిత వర్షాలు ఖరీఫ్ వరి రైతులకు మేలు కలిగించాయనే చెప్పాలి. ఇప్పటి వరకు సరైన వర్షాలు లేక నాట్లు వేయడానికి అవకాశం లేక సతమతమవుతున్న రైతులు భారీ వర్షాలతో ఆనందం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మడుల్లోకి నీరు చేరింది. మండల గ్రామాల మీదుగా శారదానది ప్రవాహం పెరిగి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో నదిపై ఉన్న గ్రోయిన్ల ద్వారా ఉన్న సాగు నీటి కాలువల నుంచి పంట భూములకు నీరు చేరుకుంటోంది. నది పరివాహక ప్రాంత రైతులు వరి ఆకు నారు ఎదిగి ఉన్న చోట్ల, నీటి వనరులు ఉన్న చోట్ల నాట్లు వేసేందుకు సమాయత్తం అయ్యారు. మిగిలిన వారు దమ్ము దున్నుకోవడానికి సన్నద్ధమవుతున్నారు. ఆదివారం ఉదయం 8.30 నుంచి సోమవారం ఉదయం 8.30 గంటల వరకు 85 మిల్లీమీటర్లు, అప్పటి నుంచి సాయంత్రం వరకు 12 మిల్లీ మీటర్ల వంతున వర్షపాతం నమోదు అయింది. రెండో రోజు వర్షం తగ్గుముఖం పట్టింది. వర్షాలతో సతమతమవుతున్న ప్రజలు తెరిపివ్వడంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు. అయితే తుపాను హెచ్చరిక నేపథ్యంలో ఇంకా వర్షాలు పడతాయని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా వర్షాలు వరి రైతులకు మేలు కలిగిస్తున్నాయని, ఎదిగిన వరి నారు ఉన్న రైతులు నాట్లు చేపట్టినట్లు మండల వ్యవసాయ అధికారి ఎం. స్వప్న తెలిపారు. వారం రోజుల వరకు వరి నారు, నాట్లకు నష్టం ఉండదన్నారు. మునిగిన పొలాల్లో అవసరానికి మించి నీరు ఎక్కువగా నిల్వ ఉండకుండా తొలగించుకోవాలన్నారు.



జోగారావుపేట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న శారదా నది



సిబ్బందితో చర్చిస్తున్న తహసీల్దార్ తిరుమల రావు, ఎంపీడీవో ధర్మారావు

వర్షం కురిస్తే కార్యాలయాల్లోకి నీరు



ఆర్డీవో కార్యాలయం ఎదుట నిలిచిపోయిన నీరు



నీట మునిగిన ఆర్టీసీ కాంప్లెక్స్

అనకాపల్లి టౌన్: జిల్లా కేంద్రంగా ఏర్పడిన అనకాపల్లిలో అభివృద్ధి మాత్రం తీసికట్టుగానే ఉంది. ప్రజా సమస్యలు చెప్పుకొనే కార్యాలయాలే దీనికి నిదర్శనం. ఇక్కడ రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తహసీల్దార్, ఆర్డీవో, ఉప కార్యనిర్వాహక ఇంజనీరు కార్యాలయాలు, ఆర్టీసీ కాంప్లెక్స్, ఎన్టీఆర్ గ్రౌండ్‌లో నీరు చేరిపోయింది.
ఈ ప్రాంతాల్లో కనీసం వర్షపు నీరు పోయే అవకాశం లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇవే ఇలాగుంటే, ఇక మన సమస్యలేమి పరిష్కరిస్తారని ఇక్కడికి వచ్చే ప్రజలు గుసగుసలాడుకోవడం గమనార్హం.



లోనికి వెళ్లడానికి వీలు లేకుండా ఉన్న ఉప కార్యనిర్వాహక ఇంజనీరు కార్యాలయం



తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు



వర్షం నీరు చేరడంతో బురద మయంగా మారిన ఎన్టీఆర్ గ్రౌండ్

విద్యార్థుల గౌరవాన్ని దెబ్బతీసే నేరం ర్యాగింగ్

తగరపువలస: విద్యార్థుల భద్రతను, గౌరవాన్ని దెబ్బతీసే నేరం ర్యాగింగ్ అని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ పేర్కొన్నారు. భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే అటువంటి దుశ్చర్యలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీలో సోమవారం నిర్వహించిన ర్యాగింగ్ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ర్యాగింగ్‌కు సంబంధించి చట్టపరమైన నిబంధనల గురించి తెలియజేశారు. విద్యార్థులు యూజీసీ, ఐఐఎం సంస్థాగత నిబంధనలను పాటించాలని సూచించారు. ర్యాగింగ్ వ్యతిరేక చర్యలపై విద్యార్థులు, తల్లిదండ్రులు, మీడియా, పౌర సమాజం, పోలీసు అధికారుల పాత్రను యాంటీ ర్యాగింగ్ కమిటీ చైర్మన్, డీన్ సూరిశెట్టి విజయభాస్కర్ తెలియజేశారు. పరిపాలన డీన్ ప్రొఫెసర్ కావేరి కృష్ణన్ మాట్లాడుతూ క్యాంపస్‌లో నిఘా, నివారణ చర్యలు, యాంటీ ర్యాగింగ్ కమిటీ, యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్ పాత్ర గురించి వివరించారు. వారం రోజుల పాటు విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్‌పై నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం ర్యాగింగ్ వ్యతిరేక పోస్టర్‌ను ఆవిష్కరించారు.

- సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో సీపీ శంఖబ్రత బాగ్చి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ పీవీ సుధాకర్, సీఈవో చంద్రశేఖర్‌రెడ్డి, ఏవో శివ ప్రసాద్, మధురవాడ జోన్ ఏసీపీ అప్పలరాజు, భీమిలి సీఐ తిరుమలరావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.